క్లుప్తంగా

శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు.

ఉద్యాన పంటలు సాగు చేసుకోండి



హరినగరం వద్ద మామిడి తోటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలని ఐటీడీఏ ప్రత్యేక అధికారి కేజీ నాయక్ గిరిజనులకు సూచించారు. మండలంలోని హరినగరం చెంచులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేసుకునే వారికి ప్రభుత్వం వంద శాతం రాయితీ కల్పిస్తుందని ఇందులో ప్రధానంగా నన్నారీ సాగు చేసుకొని మంచి లాభాలు గడించాలని సూచించారు. ఉద్యాన పంటలు సాగు చేసేవారికి ఆయిల్ ఇంజిన్లు, మందు పిచికారీ చేసుకునేందుకు పవర్ స్ప్రేయర్లు అందిస్తుందని చెప్పారు. ఐటీడీఏ కింద హరినగరంతో పాటు చాగలమర్రి మండలంలోని డి.వనిపెంటకు అవకాశం ఉందన్నారు. ఐటీడీఏ ఏఓ ధనుంజయ్,ఏపీఎంలు జోహర్‌బాషా, సత్యనారాయణ ఉన్నారు.

పరామర్శ

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాకనూరు చిన్నవెంకటరామిరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి కాలు విరగడంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఆయనను పరామర్శించారు.యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు ఉన్నారు.

పథకాలను వినియోగించుకోండి

దొర్నిపాడు: కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రపురం, దొర్నిపాడు గ్రామంల్లో సర్పంచులు బబ్బూరి ఉమాదేవి, సానికా దేవమణిల అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు బబ్బూరి వెంకటస్వామి ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

నామమాత్రపు ధరతో ధాన్యం నిల్వ

ఆళ్లగడ్డ: మార్కెట్ యార్డ్‌లో ధాన్యం నిల్వ చేసుకుంటే బస్తాకు నెలకు రూ.3 మాత్రమే వసూలు చేస్తామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నామ మాత్రపు ధరకు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలని ఆదేశించిందని చెప్పారు. దీంతో యార్డ్ పాలక మండలి సభ్యులతో చర్చించి ఒక్కో ధాన్యం బస్తాకు నెలకు బాడుగ రూ.3, బీమాకు రూ.1 ప్రకారం నిర్ణయించారన్నారు. ముందుగా అడ్వాన్స్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం తరలించే సమయంలో పూర్తిగా చెల్లించి తమ ధాన్యం విక్రయించుకోవచ్చని, నియోజకవర్గంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ

చాగలమర్రి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై వీఆర్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలులో శిక్షణ పొందిన ఆళ్లగడ్డకు చెందిన వీఆర్‌ఓ టి.సునీల్ ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

ఉయ్యాలవాడ : రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా వున్న 58 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు దేవరాజు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో స్పెషల్ శానిటేషన్ పనులు చేపట్టారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ పనులను పరిశీలించారు.

అమరజీవి .. సమరజీవి



నివాళులర్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి: ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగంతో అమరజీవిగా నిలవడమే కాకుండా సమరజీవిగా ఖ్యాతిగాంచారని రిటైర్డ్ తెలుగు పండిట్ ఎస్‌వి క్రిష్ణయ్య అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పులామాల వేసి నివాళులర్పించారు. నవత ప్రసాద్, నాగభూషణం, రాజేశ్, జగదీష్, మల్లికార్జున, ఆనంద్, బి.రవికుమార్, బాలకృష్ణ, గుత్తి నరసింహులు పాల్గొన్నారు.

విస్తారంగా వరి సాగు

- బోరు మోటార్ల కిందజోరుగా సాగుతున్న వరి నాట్లు
- దిగుబడి, ధర ఆశాజనకంగా ఉండటంతో రెండో పంటగా సాగు



తిప్పారెడ్డిపల్లె వద్ద వరి నాట్లు వేస్తున్న కూలీలు



రుద్రవరం వద్ద బురద సేద్యం చేస్తున్న దృశ్యం



నాటేందుకు సిద్ధంగా ఉన్న వరి నారు

రుద్రవరం: మండలంలో రెండో పంటగా వరి విస్తారంగా సాగవుతోంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీలో ఖరీఫ్ కింద దాదాపు 7,500 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయడంతో చెరువులు,పంట కాల్వల ద్వారా నీటి తడులు అందించడంతో మంచి దిగుబడులు లభించాయి. ఎన్నడూ లేనంతా వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 42 బస్తాల (75కేజీలు)దిగుబడి లభించింది. వాటికి తగ్గట్టుగానే ధరలు కూడా బస్తా రూ.2300 నుంచి రూ.2600 పలుకుతోంది. దీంతో రైతులు మంచి లాభాలు గడించారు. ఓ వైపు ఖరీఫ్ కోతలు, ధాన్యం విక్రయాలు సాగిస్తూనే, సొమ్ము చేతికందగానే బోర్లు ఉన్న రైతులు రెండో పంట సాగుకు రెట్టించిన ఉత్సాహంతో నారుమడులు సిద్ధం చేసుకోవడం, బురద సేద్యాలు చేస్తున్నారు. ఇప్పటికే నారు సిద్ధంగా ఉన్నవారు నాట్లు కూడా వేయించారు. చాలా చోట్ల వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, మందలూరు, అప్పనపల్లె, ఎల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ముత్తలూరు, ముకుందాపురం,తిప్పారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వరి విస్తారంగా సాగవుతోంది. మండలంలో దాదాపు 9,850 బోరు మోటార్లు ఉన్నాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో రైతులు ఆలస్యం అయినప్పటికీ రెండో పంటగా వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా సాగైందని అధికారులు పేర్కొంటున్నారు.

మరీ ఇంత దిగజారుడుతనమా?

- తమ పార్టీ వారికే కండువాలు కప్పి.. వైఎస్సార్‌సీపీ నాయకులు చేరారంటూ టీడీపీ ప్రచారం
- మనుగడ కోల్పోతామనే దిక్కుమాలిన రాజకీయం
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శిరివెళ్ల: టీడీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలను చూసి జనం నవ్వుకుంటున్నారు. సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్న ప్రజలు జగనన్నకు మద్దతుగా నిలుస్తుండటంతో మనుగడ కోల్పోతామని ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని గుండంపాడు గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు రేవనూరు రామాంజనేయరెడ్డి, దండె ప్రతాపరెడ్డి, శంకర్‌రెడ్డి ధ్వజమెత్తారురు. శుక్రవారం వారు గ్రామంలో మాట్లాడుతూ ఈ నెల 14న మాజీ మంత్రి అఖిలప్రియ గ్రామానికి వచ్చి వారి పార్టీకి చెందిన వారికే టీడీపీ కండవాలు కప్పి వైఎస్సార్‌సీపీకి చెందిన 75 కుటుంబాలు, వార్డు మెంబర్లు తమ పార్టీలో చేరారంటూ ప్రచారం చేసుకోవడం దిగజారుడుతనమేనన్నారు. వాస్తవానికి నలుగురు వార్డు మెంబర్లు టీడీపీ మద్దతుదారులేనన్నారు. అలాగే సర్పంచు సంగిరెడ్డి మౌనిక కూడా తమ పార్టీ రెబల్‌గా ఉండి టీడీపీ మద్దతుతో గెల్చిందన్నారు. తమ పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరంగా ఉంటున్నారని చెప్పారు. ఇక ఉప సర్పంచు కత్తి ప్రసాద్ కూడా టీడీపీ మద్దతుదారుడేనన్నారు. తమ పార్టీకి చెందిన వారెవరూ టీడీపీలో చేరలేదని, దిక్కులేక, మనుగడ కోల్పోతున్నామని ఇలాంటి ప్రచారానికి తెరతీశారని మండిపడ్డారు. వారి రాజకీయాలను చూసి గ్రామస్తులు నవ్వుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గాలి ప్రకాశం, రవికుమార్, ఎంపీటీసీ రమణారెడ్డి, హనుమంతరెడ్డి, దస్తగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఓబులేసు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



బహుమతులతో క్రీడాకారులు



పథకాలు సాధించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విజేతలకు ఎస్‌డీఆర్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కొండారెడ్డి బహుమతులు అందజేశారు. త్రివేంద్రంలో జరిగే జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల కోచ్‌లు రవికుమార్, దాసు, సాల్మన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, బత్తుల రవికుమార్, అబ్జర్వర్ దిలీప్ పాల్గొన్నారు.

ఆర్‌యూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ..

పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 14న కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బి.రాజేశ్వరి 100మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం, సి.అనూష వెండి పతకం, కె.శాంతకుమారి 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, నాగేంద్రమ్మ 800 మీటర్ల నుంచి 1500 మీటర్లలో వెండి పతకాలు, వెంకటలక్ష్మి 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, మహిళలు 400''100 మీటర్లలో వెండి పతకాలు సాధించారన్నారు. పురుషుల విభాగంలో వెంకట సునీల్ 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, బ్రహ్మం 100 మీటర్లలో కాంస్య పతకం సాధించారని వివరించారు. విద్యార్థులు, పీడీ శ్రీనివాసులును అధ్యాపకులతో కలిసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ...

రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బాలా అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, రవీంద్ర తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అండర్-17 బాలికల విభాగంలో 46-48 కేజీల్లో ఎస్.అఫియా బ్రాంజ్ పథకాలు, 63, 66 కేజీల్లో దీపిక బ్రాంజ్ పథకాలు, 80 ప్లస్ కేజీల్లో శరణ్య సిల్వర్ పథకం, బాలురలో అండర్-14, 44-46 కేజీల్లో రంజాన్, షరీఫ్ బ్రాంజ్ పథకాలు 48-50 కేజీల్లో లిఖిత్ అశ్విన్ బ్రాంజ్ పథకం, అండర్-17లో 63-66 కేజీల్లో ఎస్.తౌసిక్ బ్రాంజ్ పథకం, 80ప్లస్ కేజీల్లో మహమ్మద్ జోసెబ్ సిల్వర్ పథకం సాధించారని వివరించారు. విద్యార్థులు, కోచ్ మహేష్ యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులును అభినందించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల నియామకం

నంద్యాల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీలో నంద్యాల నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు స్థానం దక్కింది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటన మేరకు నియామకాలు.. జిల్లా బీసీ సెల్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.వెంకటసుబ్బయ్య, కార్యదర్శులుగా శంకర్‌గౌడ్, బాలహుసేని, జాయింట్ సెక్రటరీలుగా డి.సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసయాదవ్, జిల్లా కల్చరల్ వింగ్ కమిటీ అధ్యక్షుడుగా టి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా డీసీ సిద్దయ్య, కార్యదర్శులుగా రామబ్రహ్మాచారి, రాజగోపాల్, జాయింట్ సెక్రటరీలుగా బి.చిన్నశేషయ్య, పి.కరుణాకర్‌రావు, జిల్లా ఐటీ వింగ్ కార్యదర్శులుగా సి.మధు, కె.ప్రభు, జాయింట్ సెక్రటరీలుగా బి.నాగమద్దిలేటి, కె.మహేష్‌ను నియమించారు.

అలాగే జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా షేక్ కాశిం, కార్యదర్శులుగా ఎస్.ముర్తుజా, అబ్దుల్‌రషీద్, జాయింట్ సెక్రటరీలుగా ఎన్.జక్రియా, ఎం.బాషా, జిల్లా పంచాయతీరాజ్ జనరల్ సెక్రటరీగా వై.కోటేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా ఈ.రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా పి.రఘురామిరెడ్డి, ఎం.పుల్లయ్యయాదవ్, జిల్లా పబ్లిక్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా ఎం.సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శులుగా సి.సత్యం, వై.రామసుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.సందీప్‌కుమార్, బి.చిరంజీవి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎం.జగదీశ్వరరెడ్డి, కార్యదర్శులుగా డి.సుధాకర్, ఏ.నారాయణ, జాయింట్ సెక్రటరీలుగా టి.కరీమ్, ఎం.శివప్రసాద్, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆంజనేయులు, కార్యదర్శులుగా పి.వెంకటరమణ, ఎన్‌సుంకన్న, జాయింట్ సెక్రటరీలుగా వై.శివశంకర్, ఎస్.బాలకృష్ణ, జిల్లా స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా మేకల సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, కార్యదర్శులుగా పి.ఆనంద్, క్రాంతికుమార్, జాయింట్ సెక్రటరీలుగా కె.సుధీర్‌కుమార్, బి.హేమంత్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఏ.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పి.సత్యనారాయణ, టి.సురేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా టి.మల్లికార్జున, కె.విష్ణువర్ధన్, జిల్లా వికలాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా వై.దివాకర్‌రెడ్డి, కార్యదర్శులుగా ఆర్.వెంకటరావు, వీరభద్రుడు, జాయింట్ సెక్రటరీలుగా చలపతి, నాగేశ్వరరెడ్డి, జిల్లా యూత్‌వింగ్ ప్రధాన కార్యదర్శిగా బి.నాగార్జునుడు, కార్యదర్శులుగా జక్రియా, ఏ.మహేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా గురులోకేష్, పి.దీపక్‌మని, జిల్లా వైఎస్సార్‌టీయూసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్.అల్లాబకాస్, కార్యదర్శులుగా పి.శేషన్న, బి.శేషన్న, జాయింట్ సెక్రటరీలుగా పీఎం చెన్నయ్య, పి.ప్రభును నియమిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ : స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. అయితే వ్యవసాయానికి సంబంధించి తెల్లవారుజామున 5 నుంచి యథావిధిగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

భూములు, ఇళ్ల పరిశీలన

దొర్నిపాడు: నంద్యాల-జమ్మలమడుగు మధ్య ఎన్‌హెచ్-167కే నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో భాగంగా బాధిత రైతులతో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గుండుపాల గ్రామంలో తహసీల్దార్ జయప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులతో కలిసి ఇళ్లు, భూములను పరిశీలించారు. అనంతరం రైతుల నుంచి ఆధార్ కార్డు, ఆర్‌ఓఆర్, అడంగళ్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం, ఈసీ తదితర వాటిని స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన

రుద్రవరం: ఆరోగ్యశ్రీ పై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు నవీన్ సూచించారు. పీహెచ్‌సీలో శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలతో ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కేటాయించిన బడ్జెట్ కంటే ప్రభుత్వం మరింత పెంచిందని ఆ మొత్తాన్ని, అందులోకి వచ్చే వ్యాధు ల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి సెల్‌ఫోన్‌లలో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది శుక్రవారం తెలిపారు. వివరాలు.. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొత్తకోటకు చెందిన ఎదురు నాగార్జునరెడ్డి, వెలుగోడు మండలం మోతుకూరు గ్రామానికి చెందిన చాపల బాషా పట్టణంలోని ఎస్‌బీఐ టర్నింగ్ వద్ద దారిలో వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నాగార్జునరెడ్డికి 10 రోజులు, చాపల బాషాకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు చెప్పారు.

మద్యం మత్తులో దాడి..ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: స్థానిక మద్యం దుకాణం సమీపంలో శుక్రవారం నెలకొన్న దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కొండమాయపల్లెకు చెందిన పెద్ద ఓబులేసు,చిన్న ఓబులేసు,నరసింహ, బి.నాగిరెడ్డిపల్లెకు చెందిన ఇసాక్ మద్యం మత్తులో ఒకరిపై మరొకరు దుర్భాషలాడుకుంటూ రా ళ్లు, గాజు ముక్కలతో దాడులు చేసుకున్నారు. దాడిలో ఇసాక్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాలకు తరలించారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ శనివారం నంద్యాలకు రానున్నట్లు మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లింగస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో శనివారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

శిరివెళ్ల: 18వ జాతీయ రహదారిపై ఈనెల 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగారి శంకరమ్మ (67) శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. గోవిందపల్లెకు చెందిన శంకరమ్మ పొలం పనులకు వెళ్లి ఇంటికి వెళ్తుండగా నంద్యాల నుంచి శిరివెళ్లకు వెళ్తున్న బైక్ వేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిందని ఎస్‌ఐ వివరించారు. భర్త కొండారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంతో పాటు రెడ్డిపల్లె,తువ్వపల్లె,ముత్తలూరు తదితర గ్రామాల్లోని 11అంగన్‌వాడీ కేంద్రాల తలుపులను ఇన్‌చార్జ్ అధికారులు శుక్రవారం తెరిచారు. నాలుగు రోజులుగా తమ సమస్యల పరిష్కారం పేరుతో అంగన్‌వాడీ వర్కర్లు కేంద్రాలను మూసేసి నిరసన చేపట్టారు. దీంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వాటిని తొలగించేదుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ మధుసూదనరెడ్డి మండలంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాలకు 16 గ్రామ సచివాలయాల ఉద్యోగులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమప్రాధాన్యమిస్తున్నారని, దీంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం ఓబులంపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. దేశంలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇదే బడ్జెట్ ప్రవేశపెట్టేవారని.. మరి అప్పుడు ఇన్ని సంక్షేమ పథకాలను చంద్రబాబు ఎందుకు అమలు చేయలేకపోయారో నిలదీయాలని ప్రజలకు సూచించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను, ఎల్లో మీడియా పిచ్చిరాతలను పట్టించుకోవద్దని, సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ ఖాశీం, ఉప సర్పంచ్ రవి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తున్నాం



42వ వార్డులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరిస్తున్నామని 42వ వార్డు కౌన్సిలర్ శిరీష పేర్కొన్నారు. శుక్రవారం వార్డులో వార్డుకు పోదాం కార్యక్రమం వార్డు ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అభివృద్ధి సంక్షేమాలను వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వార్డులో రూ.22.77కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగిందని చెప్పారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.

పట్టణంలో ముగిసిన 'వార్డుకు పోదాం'..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డుకు పోదాం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పారవి సహకారంతో నంద్యాల పట్టణంలోని 48 వార్డుల్లో చేపట్టిన వార్డుకు పోదాం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మాట్లాడుతూ నంద్యాల అర్బన్ పరిధిలోని 48 వార్డుల్లో డీబీటీ కింద 2,42,610 మంది లబ్ధిదారులకు సుమారుగా రూ.683.07 కోట్ల మేర వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. నాన్ డీబీటీ కింద 1,41,827 మందికి లబ్ధి చేకూరేలా రూ.138.86 కోట్లను పలు రకాల అభివృద్ధి పనులను వెచ్చించామని వివరించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించి, కృషి చేసినన ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ : టిడ్కో గృహ సముదాయం ఆవరణలో అసాంఘిక కార్యకలాపలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు. పట్టణ శివారులోని జగనన్న టిడ్కో గృహ సముదాయాలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులో ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అసరం లేదన్నారు. పోలీసులు నిరంతరం పర్యవేక్షించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రస్తుతానికి టిడ్కో కార్యాలయంలో డ్యూటీ బుక్ పెట్టి నైట్ డ్యూటీ పోలీసులు వచ్చి రౌండ్ వేసి అందులో సంతకాలు చేసి వెళ్లేలా ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేలా పోలీసుల ఫోన్ నంబర్‌లతో కూడిన బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. టిడ్కో ఇన్‌చార్జ్ రామసుబ్బయ్య, ప్రవీణ్ ఉన్నారు.

19న మినీ జాబ్ మేళా

ఆళ్లగడ్డ: ఈ నెల 19వ తేదీన యర్రగుంట్ల జీటీఆర్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ మాధవ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాలో 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ అర్హత కల్గిన అభ్యర్థులు ధ్రువ ప్రతాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఫోన్ 9440224291, 9701303790 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శిరివెళ్ల: ఈ నెల 19వ తేదీన యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి నుంచి పీజీ చేసిన వారు హాజరు కావచ్చన్నారు. జపనీస్ ఆటో మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తున్నారని చెప్పారు. అర్హతలను బట్టి రూ. నెలకు రూ.15 వేల నుంచి ఏడాదికి రూ.2.80 లక్షలు వేతనం చెల్లిస్తారన్నారు.18 -27 ఏళ్ల వయస్సున్న వారు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

వేతనాలు పెంచాలి

గోస్పాడు: అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలని ఆ సంఘం నాయకురాళ్లు నిర్మలమ్మ, రమణమ్మ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే దీక్ష నిర్వహించారు.

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నాలుగవ రోజుకు చేరింది. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడులపై అంచనా



ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: పంట కోత ప్రయోగంతో దిగుబడులు అంచనా వేసేందుకు వీలవుతుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట కోతలో వరిలో పంటకోత ప్రయోగాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 25 చదరపు మీటర్లలో చేయగా 19 కేజీల 250 గ్రాములు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఏఓ స్వప్నికారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి తిరుప్పావై దివ్యప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్లు భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, మదుసూదన్ శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం దివ్యప్రబంధ ప్రాజెక్టు సౌజన్యం, నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి రోజూ సాయంత్రం 7గంటల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు. 23న వైకుంఠ ఏకాదశి రోజున వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29న అష్టోత్తర శత కలశాభిషేకం, జనవరి 4న స్వామివారి తిరుప్పావడ సేవ, 6న ఊంజల సేవ, 12న లక్ష తులసీ పూజ, 14న గోదాదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని వివరించారు.

సంతాపం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హృదయరాజు, నగరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆయన చురుకైన ఉద్యమకారుడు అని కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.